# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 135 క్రిష్ణా, సోమవారం 09 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-







## పోలవరం ఆశ్రమ పాఠశాల ఘటనపై సీఎం సీరియస్:



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 08 :** పోలవరం నియోజకవర్గం దేవరపల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో చోటుచేసుకున్న అస్వస్థత ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడేలా వ్యవహరించిన అధికారుల పట్ల ఆయన అసహనం వ్యక్తం చేస్తూ, ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రేపటిలోగా సమగ్ర నివేదికను తన కార్యాలయానికి అందజేయాలని, ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఉన్నా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.
పాఠశాలలో నిన్న ఉదయం టిఫిన్ తిన్న తర్వాత సుమారు 92 మంది విద్యార్థులు ఒక్కసారిగా కడుపునొప్పి, జ్వరం బారిన పడటంతో స్థానికంగా కలకలం రేగింది. వెంటనే స్పందించిన పాఠశాల సిబ్బంది వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు. కలుషిత ఆహారం లేదా నీటి వల్లనే ఈ పరిస్థితి తలెత్తి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులందరూ వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని, ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం లేదని జిల్లా అధికారులు వెల్లడించారు.

ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కేవలం శాఖాపరమైన చర్యలతో సరిపెట్టకుండా, అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయాలని ముఖ్యమంత్రి కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో పారిశుధ్యం, భోజన నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని ఆయన అధికారులను హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని హాస్టళ్లలో తనిఖీలు చేపట్టాలని విద్యా మరియు సంక్షేమ శాఖల అధికారులకు సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉందని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు మరియు స్థానిక యంత్రాంగం భరోసా ఇచ్చారు. బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చూడటంతో పాటు, వారి డైట్ మరియు వసతులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విచారణ నివేదిక ఆధారంగా రాబోయే రోజుల్లో విద్యా సంస్థల నిర్వహణలో మరిన్ని కఠిన నిబంధనలు అమలులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

## ఏపీలో యువత భవితను మార్చేలా....మరో ప్రతిష్టాత్మక సంస్థ

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 08 :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మరో ప్రతిష్టాత్మక సంస్థ కొలువుదీరనుంది. అమరావతిలో ఏఐ లివింగ్ ల్యాబ్ ఫౌండేషన్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అనువర్తిత అభ్యాసం, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఫౌండేషన్ ఏర్పాటు కానుంది. ప్రధాన కార్యాలయంలో అమరావతిలో ఏర్పాటు కానుండగా.. రాష్ట్రవ్యాప్తంగా ఏఐ లివింగ్ ల్యాబ్‌లను స్థాపించి, నిర్వహించనున్నారు.
"కంపెనీస్ యాక్ట్, 2013 ప్రకారం ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఫౌండేషన్ పేరుతో సెక్షన్ 8 (లాభాపేక్షలేని) కంపెనీని ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతోంది" అంటూ ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఫౌండేషన్ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ కంప్యూటింగ్ రిసోర్సెస్, ఏఐ టూల్స్, క్యూరేటెడ్ డేటా సెట్స్ సమకూర్చనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి ప్రతి కుటుంబంలోనూ ఒక ఏఐ శిక్షణ పొందిన వ్యక్తి ఉండాలనే ఆశయ సాధన కోసం ఈ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఫౌండేషన్ పనిచేస్తుంది. ఈ ఫౌండేషన్ ఏఐ స్కిల్లింగ్ కార్యక్రమాలు, సర్టిఫికేషన్ పాత్‌వేస్, కరికులమ్ ఎనేబుల్‌మెంట్, ఫ్యాకల్టీ ట్రైనింగ్ వంటి అంశాలలోనూ సహకారం అందిస్తుంది. విద్యార్థులతో పాటుగా ఫ్యాకల్టీ, పరిశోధక విద్యార్థులు, స్టార్టప్స్, సూక్ష్మ. మధ్య తరహా పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలకు సహకారం అందిస్తుంది. అలాగే వ్యవసాయ రంగం, ఆరోగ్య రంగం, తయారీ రంగం, ఫిన్ టెక్ రంగాలలో ఏఐ సేవలు అందిస్తుంది. ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఫౌండేషన్ కార్యక్రమాల కోసం ప్రభుత్వ గ్రాంట్లు, కార్పొరేట్




సోషల్ రెస్పాన్సిబులిటీ నిధులు ఉపయోగిస్తారు. మరోవైపు అమరావతిని ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నారు. శనివారం రోజున క్వాంటం వ్యాలీ భవనానికి శంకుస్థాపన కూడా నిర్వహించారు. ఈ భవనాన్ని ఆగస్టు నాటికి పూర్తి చేసి.. డిసెంబర్ నాటికి క్వాంటం వ్యాలీలో తొలి క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా అడుగులు వేస్తోంది. అమరావతిలో క్వాంటం వ్యాలీ పూర్తి అయితే దేశానికే గేమ్ ఛేంజర్‌గా మారుతుందని సీఎం చంద్రబాబు నాయుడు కూడా వెల్లడించారు. అమరావతి క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలు ఏపీకి గేమ్ ఛేంజర్ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సమయమే.. సైబర్ సురక్ష సైబర్ నేరాల కట్టడికి గోల్డెన్ అవర్ కీలకం

**ఆ సమయం దాటితే కష్టమంటున్న పోలీసులు**
**ఎన్ఆర్ఐలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులే టార్గెట్**
**ఆ మూడు వర్గాలే లక్ష్యంగా సైబర్ నేరాలు**
**నగదు క్షణాల్లో వివిధ ఖాతాలకు బదిలీ**
**త్వరగా స్పందిస్తే తిరిగి రాబట్టే అవకాశం**




**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 08 :** సైబర్ వల విసురుతున్న నేరగాళ్లు ప్రధానంగా మూడు వర్గాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఎన్ఆర్ఐలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు డిజిటల్ అరెస్టు పేరుతో ఎర వేస్తున్నారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలను పరిశీలిస్తే.. ఇదే విషయం అర్థమవుతోంది. పెట్టుబడి నేరాల్లోనూ ఇదే సూత్రాన్ని పాటిస్తున్నారు. సైబర్ నేరాల్లో బాధితుల సంఖ్యను తగ్గించడానికి, ప్రజల ప్రతి రూపాయిని సురక్షితంగా ఉంచడానికి పోలీసులు సైబర్ సురక్ష ప్రాజెక్టును మొదలుపెట్టారు. పోలీసులు తమ ట్రాక్‌లోకి బ్యాంకర్లను లాక్కురావడంతో జిల్లాలో డిజిటల్ అరెస్టులకు బ్రేకులు పడ్డాయి. ఈ కేసులు తగ్గుముఖం పట్టడంతో పెట్టుబడి నేరాలకూ బ్రేక్‌లు వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. 'ఈ' నేరాల బారిన పడకుండా ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్న యోచనలో పోలీసులు ఉన్నారు.

**వెంటనే స్పందించడం మేలు**

ఎన్ఆర్ఐ మహిళ పోగొట్టుకున్న రూ.కోటీ25లక్షల నుంచి రూ.25 లక్షలను పోలీసులు తిరిగి ఆమెకు ఇప్పించగలిగారు. సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు ఆర్టీజీఎస్ ద్వారా డబ్బు పంపాక ఆమె మోసపోయానన్న అనుమానంతో సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వెంటనే స్పందించి ఆ బ్యాంకు అధికారులను సంప్రదించి అందులో ఉన్న రూ.25 లక్షలను ఏ ఇతర ఖాతాల్లోకి వెళ్లకుండా నిలువరించగలిగారు. మిగిలిన డబ్బు మాత్రం వేర్వేరు ఖాతాలకు వెళ్లిపోయాయి. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న బాధితులు తక్షణమే స్పందిస్తే జమ చేసిన డబ్బును వారి చేతుల్లోకి వెళ్లకుండా కట్టడి చేయవచ్చని పోలీసులు చెబుతున్నారు.

**గోల్డెన్ అవర్ కీలకం**

జనం నుంచి డబ్బు జమ చేయించుకున్న తర్వాత సైబర్ నేరగాళ్లు వాటిని వెంటనే వేర్వేరు ఖాతాలకు మళ్లించేస్తారు. కొంతమంది ఏటీఎం కార్డుల ద్వారా డబ్బు తీయించేస్తారు. మరికొంతమంది ఆ డబ్బుతో ఆన్‌లైన్ షాపింగ్ చేయిస్తారు. సాధారణంగా ఈ నేరగాళ్లు ఒక్కో ఖాతాను కనీసం నెల రోజులే ఉపయోగిస్తారు. తర్వాత దాన్ని వదిలేస్తారు. డిజిల్ అరెస్టు పేరుతో కాల్స్ వచ్చినా, పెట్టుబడులకు సంబంధించిన లింక్‌లు వచ్చినా స్పందించకపోవడం మేలు. అవగాహనలోపంతో నేరగాళ్ల వలలో పడినా గోల్డెన్ అవర్‌లో బాధితులు స్పందించడం ద్వారా నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

**ఇలా చేస్తే సురక్షితం**

డిజిటల్ అరెస్టు పేరుతో ఎవరు వీడియో కాల్స్ చేసినా ఆ నెంబర్లను బ్లాక్ చేయాలి. అదే పనిగా నెంబర్లను మార్చేస్తే వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఒకవేళ భయంతో ఈ నేరగాళ్లు చెప్పిన ఖాతాల్లో డబ్బు జమ చేసినా వెంటనే 1930కి ఫోన్ చేయాలి. ఇలా ఫోన్ చేయగానే డబ్బు జమ అయిన బ్యాంకులకు లావాదేవీలను నిలుపుదల చేయమని అలెర్ట్ వెళ్తుంది. తద్వారా ఆ డబ్బు సైబర్ నేరగాళ్లు కదిపే అవకాశాన్ని కోల్పోతారు. పెట్టుబడి నేరాలన్నీ లింక్‌ల ద్వారా జరుగుతున్నాయి. ఈ తరహా లింక్‌లన్నీ టెలిగ్రాం గ్రూపులో పోస్టవుతున్నాయి. ఇలా వచ్చిన లింక్‌లను వెంటనే డిలీట్ చేయడం ఉత్తమం.

## స్వర్ణాంధ్ర 2047 విజన్ 10 సూత్రాల అమలుపై చంద్రబాబు సమీక్ష




**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 08 :** రాష్ట్ర పాలన, అభివృద్ధి లక్ష్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ సుదీర్ఘ సమీక్ష జరగనుంది. ఈ సమావేశానికి మంత్రులు, ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హాజరుకానుండగా, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ విధానంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు, పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రూపొందించిన పది సూత్రాల అమలు పురోగతిపై చర్చించనున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటును పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ఆదాయాన్ని ఆర్జించే శాఖల పనితీరు, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై కూడా ఈ సమావేశంలో సమీక్ష జరగనుంది. రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని సీఎం విశ్లేషించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా అవేర్, డేటా లేక్ వంటి వ్యవస్థల వినియోగం, పాలనలో కృత్రిమ మేధ టూల్స్, ఇతర ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. వీటితో పాటు రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం, 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్ర ర్యాంకును మెరుగుపరచడం, శాంతిభద్రతల పరిస్థితిపై కూడా సమీక్షించనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖలు సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రులు, కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

## సిట్ నివేదికలో ఎలాంటి ఆధారాలు లేవని తేలినా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న కన్నబాబు



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 08 :** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే తిరుపతి లడ్డూ వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని వైసీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తీవ్రంగా ఆరోపించారు. ఆదివారం కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా కీలక హామీలను నెరవేర్చలేక, విమర్శలు ఎదురైనప్పుడల్లా లడ్డూ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు తిరుమల పవిత్రతను దెబ్బతీస్తూ, హిందువుల మనోభావాలను గాయపరుస్తున్నారని కన్నబాబు ఆరోపించారు. లడ్డూలో జంతు కొవ్వు కలిపారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని సిట్ బృందం విచారణ జరిపి, ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసినా అధికార కూటమి తప్పుడు ప్రచారం ఆపడం లేదని మండిపడ్డారు. వివాదానికి కారణమైన నెయ్యి నమూనాలను తమ కూటమి అధికారంలోకి వచ్చాకే సేకరించారని, అసలు బోలే బాబా డెయిరీకి అనుమతులు ఇచ్చిందే చంద్రబాబు గత ప్రభుత్వమని గుర్తుచేశారు. సిట్ నివేదికతో అబద్ధాలు బయటపడటంతో, ఇప్పుడు లడ్డూ తయారీలో 'టాయిలెట్ క్లీనింగ్ కెమికల్స్' వాడారంటూ చంద్రబాబు కొత్త ఆరోపణలు చేస్తున్నారని కన్నబాబు అన్నారు. జగన్‌ను రాజకీయంగా లక్ష్యంగా చేసుకోవడానికే ఈ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో దాదాపు 3,000 ఆలయాలను నిర్మించామని, తిరుమల ఏడు కొండలను కాపాడామని తెలిపారు. తప్పుడు ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని కోరిన తమ పార్టీ నేతలపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారని కన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీసుల సాయంతో 'జంగిల్ రాజ్' నడుస్తోందని ఆయన విమర్శించారు.

# కార్వేటినగరంలో బర్డ్‌ఫ్లూ?



క్రైం కౌంటర్ న్యూస్, వెదురుకుప్పం/చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 8 కార్వేటినగరం మండలం ఆర్కేవీబీ పేట పంచాయతీ ఇందిరాకాలనీలోని కోళ్లఫారంలో ఆదివారం వందలాదిగా కోళ్లు చనిపోయాయి. ఈ విషయం కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి వెళ్లడంతో తక్షణ చర్యలకు ఆదేశించారు. పశుసంవర్ధకశాఖ డాక్టర్లు, ఉద్యోగులతో కలిసి జేడీ డాక్టర్ ఉమామహేశ్వరి ఆదివారం ఇందిరా కాలనీలోని కోళ్లఫారానికి చేరుకున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. సామూహిక కోళ్ల మరణాలకు గల కారణాలపై ప్రాథమిక విచారణ చేపట్టారు. వీటిలో ఏవీఎన్ ఇన్‌ఫ్లుయెంజా (బర్డ్‌ఫ్లూ) లక్షణాలు కనిపించినట్లు ఆమె తెలిపారు. ప్రాథమికంగా బర్డ్‌ఫ్లూ అని నిర్ధారించి చర్యలు చేపట్టారు. తక్షణ ప్రొటోకాల్ ప్రకారం నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ డిసీజెస్ (ఎన్ఐహెచ్ఎ?సఏడీ)కు పంపారు. నివేదికలు వచ్చే వరకు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని పౌల?ట్ర రైతులకు, ప్రజలకు సూచించారు. కాగా, మూడు రోజులుగా సుమారు మూడు వేల కోళ్ల వరకు చనిపోయినట్లు తెలుస్తోంది. వ్యాప్తిని నిరోధించడానికి నియంత్రణ, జీవభద్రతా చర్యలను అమల్లోకి తెచ్చారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉండాలంటూ ఫారం యజమాని ఎం.గోపినాథ్‌కు నోటీసు అందజేశారు. ఫారం లోపలకు బయటి వ్యక్తులను, వాహనాలను అనుమతించరాదని హెచ్చరించారు. తదుపరి నోటీసు వచ్చే వరకు గుడ్లు, ఎరువు, మేత తరలింపు.. పౌల్ట్రీ ఉత్పత్తుల విక్రయంపై నిషేధం విధించారు. ఫారాల్లోని కోళ్లు అసాధారణంగా చనిపోయినా, శ్వాసకోస ఇబ్బందులు (గురక, ముక్కు వెంట నీరు కారడం) గమనించినా వెంటనే సమీపంలోని వెటర్నరీ డిస్పెన్సరీ లేదా పశు వైద్య అధికారులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఆ ఫారం నుంచి సుమారు కిలోమీటరు పరిధిలోని రైతులు కూడా తమ కోళ్లలో గొంతు వాపు, శ్వాసకోశ ఇబ్బందులు తదితర లక్షణాలను గమనిస్తూ ఉండాలన్నారు. కోళ్ల అనుమానిత మరణాలు, ఇతర సమాచారం కోసం పశువైద్యాధికారులు డాక్టర్ హేమకుమార్ (99597 63573), డాక్టర్ కృష్ణ (93903 18814) సంప్రదించాలన్నారు.వండిన చికెన్‌తో ప్రమాదం లేదు

వండిన చికెన్, గుడ్లు తీసుకోవడం ద్వారా ఎలాంటి ప్రమాదం లేదని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. వీటిని 70 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద బాగా ఉడికించి తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఇది మనుషులకు సోకదుబర్డ్‌ఫ్లూ (ఏవీఎన్ ఇన్‌ఫ్లుయెంజా) కోళ్ల నుంచి కోళ్లకు మాత్రమే వ్యాపిస్తుంది. ఇది మనుషులకు సోకదు. అందువల్ల పౌల్ట్రీ రైతులందరూ అప్రమత్తంగా ఉండాలి' అని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద సంఖ్యలో కోళ్లు మరణిస్తే పశుసంవర్ధకశాఖ (70131 19447), కలెక్టరేట్ కంట్రోల్ రూం (08572 242730)కు సంప్రదించాలని సూచించారు.

బాధిత రైతులకు పరిహారం!

'కోళ్ల మరణాల వల్ల నష్టపోయిన పౌల?ట్ర రైతు అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఒకవేళ భోపాల్ ల్యాబ్ నివేదికలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయి, నిబంధనల ప్రకారం కోళ్లను నిర్మూలించాల్సి వస్తే బాధిత రైతులకు పరిహారం అందేలా చూస్తాం' అని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ దామోదరనాయుడు తెలిపారు. కార్వేటినగరం మండలం ఇందిరా కాలనీ, ఆర్.కె.వి.బి పేట ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఆయన పర్యటించారు. పౌల?ట్ర ఫారాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం జేడీ, మండల పశువైద్య సిబ్బందితో ఆయన సమీక్షించారు. శాంపిల్స్ నివేదిక వచ్చే వరకు ఈ ప్రాంతాన్ని పర్యవేక్షించాలన్నారు. పరిహారానికి సంబంధించి అవసరమైన రైతుల వివరాలు, పౌల?ట్ర ఇన్వెంటరీని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. బయో- సెక్యూరిటీ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు అధికారులకు సహకరించి వ్యాధి నియంత్రణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

వెదురుకుప్పంలో అప్రమత్తం

బర్డ్‌ఫ్లూ సస్పెక్ట్ బయట పడటంతో వెదురుకుప్పం మండలంలో అప్రమత్తమయ్యారు. పౌల్ట్రీ రైతులు పశుసంవర్ధకశాఖ సూచనలు పాటించాలని పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి డాక్టర్ రాజేష్ ఆదేశించారు.

# వైభవంగా ఏటిగంగమ్మ తిరునాళ్లు



క్రైం కౌంటర్ న్యూస్,ఉరవకొండ,ఫిబ్రవరి8: మండలంలోని పెన్నహోబిలం పెన్నానది వద్ద ఆదివారం ఏటిగంగమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. ఏటా మాఘమాసం మూడో వారం ఏటిగంగమ్మ తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీ. అశ్వర్థనారాయణ కట్టకు భక్తులు పూజలను చేశారు. అలాగే ఏటిగంగమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను చేశారు. ఉత్సవమూర్తిని మేళతాళాల మధ్య ఊరేగించారు. పెన్నానదిలో భక్తులు స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెన్నానది ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆకుకూరల నాగరాజు, వార్డు మెంబర్ వనజ అన్నసంతర్పణం చేశారు.

# అప్పన్న.. సుబ్బన్న ఒక్కటేనన్నా! ఎంపీగా సుబ్బారెడ్డి లెటర్‌హెడ్‌పై పీఏ చిన్నప్పన్న ఫోన్ నంబర్

**ఇదే నంబర్‌తో చిన్నప్పన్న 'వ్యవహారాలు'**
**నాడు వైవీ పీఏగా టీటీడీలో చక్రం**
**నెయ్యి టెండర్లలో కీలక పాత్ర**
**కమీషన్లు ఇవ్వకుంటే డెయిరీలు అవుట్**
**బేరాలకు ఓకే అన్నవాటికే కాంట్రాక్టులు**
**భారీగా ముడుపులు వసూలు**
**ఢిల్లీలో ఏపీభవన్ అధికారిగానూ చిన్నప్పన్న**
**అజేయ కల్లంరెడ్డి సిఫారసుతో పోస్టింగ్**
**కల్తీ నెయ్యి దందాలో ఖాతాలోకి 4.6 కోట్లు**
**పెద్దల అండదండలు లేకుంటే సాధ్యమా?**



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 08 : కదూరు చిన్నప్పన్న.. 2019-2024 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం వ్యవహారాల్లో చక్రం తిప్పిన పెద్ద మనిషి. ఎక్కడో ఢిల్లీలో ఏపీ భవన్ స్పెషల్ లైజనింగ్ ఆఫీసర్ పోస్టులో ఉంటూ టీటీడీలో వ్యవహారాలను శాసించారు. తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన కంపెనీల నుంచి ముక్కుపిండి కమీషన్లు వసూలు చేశారు. అటు ఢిల్లీలో ఎంపీల నివాసాల్లో, ఇటు టీటీడీ పరిధిలో కీలక భేటీలు జరిపి అంతా తానై వ్యవహారాలు చక్కదిద్దారు. ఏపీ భవన్‌లో లైజనింగ్ ఆఫీసర్‌గా ఉన్న చిన్నప్పన్నకు ఇదెలా సాధ్యపడింది? టీటీడీకి, ఆయనకు అసలు సంబంధం ఏంటి? టీటీడీలో ఆయన మాట ఎలా చెల్లుబాటైంది. చిన్నప్పన్న తన పీఏ కాదని సుబ్బారెడ్డి చెబుతున్నారు. కానీ ఆయన టీటీడీ చైర్మన్‌గా పని చేసినంతకాలం చిన్నప్పన్న పీఏగానే పనిచేశారని సీబీఐ సిట్ చెబుతోంది. వైవీ మాటలు వట్టి మాటలేనని నిర్ధారించే ఆధారాలు బయటకొచ్చాయి. చిన్నప్పన్న, సుబ్బన్న ఇద్దరూ ఒకటే అని తేలిపోయింది.వైవీ లెటర్‌హెడ్‌పై చిన్నప్పన్న నంబర్ వైవీ ఎంపీగా తన లెటర్‌హెడ్‌పై ఒంగోలు ఆఫీసు అడ్రస్ ఇచ్చారు. కమ్యూనికేషన్ కోసం రెండు ఫోన్ నంబర్లు ఇవ్వగా, అందులో ఒక నంబర్ 9542419999. ఈ నంబరు చిన్నప్పన్నదే. 2019 తర్వాత కూడా అదే కమ్యూనికేషన్ కొనసాగింది. ఇదే నంబర్‌ను చిన్నప్పన్న ఉపయోగించి టీటీడీలో టెండర్లు వేసిన కంపెనీలు, సంస్థలతో సంప్రదింపులు, లావాదేవీలు జరిపారు. తిరుమలకు నెయ్యి(కల్తీ) టెండర్ల బాగోతంలో ఢిల్లీ, తిరుపతి, విజయవాడ వేదికగా ఆయన అనేక సమావేశాలు నిర్వహించారు. పలు కంపెనీల నుంచి అటు ఢిల్లీలో, ఇటు తిరుపతి వేదికగా కోట్ల రూపాయల ముడుపులు వసూలు చేశారు. సిట్ లెక్క ప్రకారం 4.6 కోట్ల రూపాయలు చిన్నప్పన్న ఖాతాలో పడ్డాయి. 2019 సెప్టెంబరు వరకే చిన్నప్పన్న తనతో పనిచేశారని, తర్వాత ఆయన ఢిల్లీ ఏపీభవన్‌లో లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేశారని, ఆయనతో తనకు ఏ సంబంధం లేదని వైవీ చెబుతున్నారు. అదే నిజమైతే.. 2019 అక్టోబరు నుంచి టీటీడీ వ్యవహారాల్లో చిన్నప్పన్న ఎందుకు వేలుపెట్టారు? చిన్నప్పన్న వైవీ పీఏగానే అందరికీ పరిచయయ్యారు. టీటీడీలోని నాటి కీలక అధికారులు, చివరకు కొనుగోలు విభాగం జనరల్ మేనేజర్ సహా ఇతర ఉన్నతాధికారులు, నిపుణులు చిన్నప్పన్న ఫోన్ నంబర్‌ను వైవీ పీఏగానే నమోదు చేసుకున్నారు. సీబీఐ సిట్ కూడా ఇదే విషయాన్ని నిర్ధారించినట్లు తెలిసింది.అజేయ కల్లంరెడ్డి సిఫారసు

గత జగన్ ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి పనిచేశారు. టీటీడీలో ఎలాగూ తనకు పీఏ, పీఎస్, ఇతర అధికారులు ఉంటారు కాబట్టి చిన్నప్పన్నను ఢిల్లీలో ఉంచి ఉపయోగించుకోవాలని వైవీ భావించినట్లుగానే పరిణామాలు జరిగాయి. అందుకే ఆయన్ను ఏపీ భవన్‌లో ప్రత్యేక లైజనింగ్ ఆఫీసర్‌గా నియమించినట్టు తెలుస్తోంది. ఇందుకు నాటి సీఎం జగన్ ముఖ్య సలహాదారు అయిన అజేయ కల్లంరెడ్డి తోడ్పాటు అందించారని స్పష్టమవుతోంది. చిన్నప్పన్నను ప్రత్యేక లైజనింగ్ అధికారిగా నియమించాలని సిఫారసు చేసింది ఆయనే. చిన్నప్పన్నను ఆ పదవిలో నియమిస్తూ గత ప్రభుత్వం 2019 అక్టోబరు 10న ఉత్తర్వులు(జీవో 2234) జారీ చేసింది. తొలుత మూడేళ్లు పోస్టింగ్ ఇచ్చారు. తర్వాత మరో రెండేళ్లు పొడిగిస్తూ 2022లో మరో ఉత్తర్వు (జీవో 2076) జారీ చేశారు. అంటే.. 2019 అక్టోబరు 10 నుంచి 2024 జూన్ 1 వరకు చిన్నప్పన్న ప్రత్యేక లైజనింగ్ అధికారిగా పనిచేశారు.

అసలు లైజనింగ్ ఎవరికోసం?

రెండో దఫా పోస్టింగ్‌లో కొనసాగించే సమయంలో.. 2022లో తనను ఏపీ భవన్ స్పెషల్ సెక్రటరీగా నియమించాలని చిన్నప్పన్న ప్రభుత్వాన్ని కోరారు. అది పెద్ద పోస్టు. కానీ ఆ పదవిలో నియమించలేదు. అయితే ఏపీ భవన్‌లో లైజనింగ్ చేయాల్సిన చిన్నప్పన్న ఎవరికోసం పనిచేశారన్నదే ఇక్కడ కీలకమైన ప్రశ్న. దీనికి సరైన సమాధానం సీబీఐ సిట్ చెబుతోంది. టీటీడీ చైర్మన్‌గా సుబ్బారెడ్డి నియమితులైనప్పటి నుంచి చిన్నప్పన్న ఆయన పీఏగానే వ్యవహరించారని తన తుది చార్జిషీట్‌లో అనేక చోట్ల స్పష్టం చేసినట్లు తెలిసింది. టీటీడీ పరిధిలోని అన్ని విభాగాల్లో చిన్నప్పన్న ఫోన్ నంబరు వైవీ పీఏగానే నమోదైందని సిట్ పేర్కొన్నట్లు సమాచారం. అదే హోదాలో చిన్నప్పన్న టీటీడీలోని కీలక విభాగాధిపతులు, నిపుణులు, ఇతర పెద్దలతో సంప్రదింపులు జరిపారని, తరచూ ఫోన్‌లో మాట్లాడారని సిట్ గుర్తించినట్లు తెలిసింది. భోలే బాబా డెయిరీ టీటీడీకి నెయ్యి సరఫరా చేయాలంటే.. తమకు కేజీకి రూ.25 చొప్పున కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది చిన్నప్పన్నే.

ఎంత గట్టి బంధమో?

2022లో భోలే బాబా డెయిరీ కమీషన్ ఇచ్చేందుకు నిరాకరించిన తర్వాత దానిపై టీటీడీకి అనేక ఫిర్యాదులు వచ్చాయి. అందులో ఆకాశరామన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. అందులో ఒక ఫిర్యాదు నాటి చైర్మన్ సుబ్బారెడ్డికి అందింది. ఆ ఫిర్యాదు మేరకు భోలే బాబా డెయిరీలో తనిఖీలు చేసి విచారణ చేయాలని సుబ్బారెడ్డి ఆదేశించారు. ఇందులో ఒక ట్విస్ట్ ఉంది. భోలే బాబా డెయిరీపై వచ్చిన ఒక ఆకాశరామన్న ఫిర్యాదును వైవీ సుబ్బారెడ్డికి అందించింది ఎవరంటే.. చిన్నప్పన్నే. సిట్ తన నివేదికలో ఈ విషయం పేర్కొంది. ఆ ఫిర్యాదు ఆధారంగా జరిగిన తనిఖీలు, అనంతర వ్యవహారాలకు చిన్నప్పన్న దిశానిర్దేశం చేశారని సిట్ స్పష్టంగా చెబుతోంది. తాము కోరినట్లుగా కమీషన్‌లు ఇవ్వని భోలే బాబా డెయిరీని కాంట్రాక్ట్ నుంచి తప్పించాలని, ఈ దిశగానే తనిఖీ రిపోర్టులు ఉండాలని టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జీఎంను చిన్నప్పన్న ఫోన్‌లో పదేపదే ఆదేశించారు. ఆ మేరకు జరిగిపోయింది. నాటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆమోదం లేకుండానే ఇవన్నీ చేశారా? వైవీతో ఏ సంబంధం లేకుండా కేవలం ఏపీ భవన్ లైజనింగ్ అధికారి ఆదేశిస్తే టీటీ డీ అధికారులు నిర్ణయాలు తీసుకుంటారా?

బేరాల తర్వాతే కాంట్రాక్టులు

నెయ్యి సరఫరా కాంట్రాక్ట్ నుంచి భోలే బాబాను తప్పించాక కొత్తగా టెండర్లు ఏ కంపెనీతో వేయించాలన్న విషయంలో కూడా చిన్నప్పన్న పాత్ర ఉంది. పలు కంపెనీలను ఢిల్లీ ఏపీ భవన్, ఎంపీల నివాసాల వద్దకు పిలిపించి సమావేశాలు నిర్వహించారు. ఇదే కోవలో ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ఎండీ జగ్‌మోహన్ గుప్తాను పిలిచి మీటింగ్ జరిపారు. రూ.483 కోట్ల కాంట్రాక్ట్‌లో కేజీకి రూ.7 చొప్పున కమీషన్ ఇవ్వాలని బేరాలు జరిపారు. ఆ తర్వాతే ఆ కంపెనీకి కాంట్రాక్టు దక్కింది. పలు దఫాలుగా చిన్నప్పన్నకు ఆ కంపెనీ డబ్బులు ముట్టజెప్పింది. కాంట్రాక్టులు దక్కించుకున్న ఇతర కంపెనీలు కూడా ఇచ్చాయి.

# ఏపీలో స్థానిక సంస్థలకు ఎన్నికలు....నిర్వహణ కసరత్తు




క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 08 : ఏపీలో మళ్లీ ఎన్నికల హడావిడి మొదలు కానుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలైంది. ఒకటి రెండు నెలల్లో ఏపీలోని పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా కొత్త ఓటర్ల జాబితా రూపకల్పన కోసం ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం నోటిఫికేషన్లు జారీ చేసింది. ఓటర్ల జాబితా తయారీని వెంటనే ప్రారంభించాలని.. మార్చి నెల 9వ తేదీన ఫోటోలతో సహా ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ నీలం సాహ్ని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు సీఈవో కార్యాలయం నుంచి అసెంబ్లీల వారీగా ఓటర్ల జాబితాలు సేకరించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఆ వివరాలను సర్వర్లలో రికార్డు చేసింది.

మరోవైపు మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులకు లాగిన్లు ఇచ్చారు. ఈ లాగిన్ల ద్వారా జాబితాలు సేకరించుకుని.. వాటిలో నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగానే ఓటర్ల జాబితా తయారు చేయనున్నట్లు తెలిపింది. 2026 జనవరి ఒకటో తేదీని ప్రామాణికంగా తీసుకుని ఓటర్ల జాబితా అప్ డేట్ చేయాలని సూచించింది.

ఎన్నికలు అప్పుడేనా.. ఏపీలో 123 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. 87 నగర పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో ముగుస్తుంది. ఇక 36 పట్టణ స్థానిక సంస్థలలో కోర్టు కేసులు, ఇతర కారణాలతో ఎన్నికలు జరగలేదు. ఈ నేపథ్యంలోనే ఈ రెండూ కలిపి 123 పట్టణ స్థానిక సంస్థలలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వీటిలోని వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితా తయారు కానుంది. అలాగే ఏపీలోని 13,098 పంచాయతీల పదవీ కాలం ఏప్రిల్ రెండో తేదీతో ముగియనుంది. 253 పంచాయతీల్లో వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. తాజాగా మొత్తంగా 13,351 పంచాయతీలలోనూ ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితా సిద్ధం చేయనున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి

# భూములు కాపాడుకోవడానికి ముందుకురావాలి

క్రైం కౌంటర్ న్యూస్, భోగాపురం, ఫిబ్రవరి8 భూములను కాపాడుకోవడమే లక్ష్యంగా అందరు ముందుకు రావాలని నాలుగు గ్రామాల రైతులు నిర్ణయించారు. భూములు పోకుండా ఉండాలంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి సిద్ధం కావాలని స్పష్టంచేశారు. ఆదివారం మండలంలోని నందిగాంలో నందిగాం, కొటభోగాపురం,శింగవరం, నాతవలసకు చెందిన రైతులు సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూములు చేజారకుం డా ఉండడానికి అధికారులు, నాయకులకు వినతులు ఇస్తున్నా పరిశీలనలు ఆగడంలేదని వినతులు పట్టించుకోనే దాఖలాలు కనిపించడంలేదన్నారు. పరిశ్రమలు ఏర్పాటు పేరుతో భూములు జోలికి రాకుండా ఉండాలంటే న్యాయస్థానమే దిక్కుఅన్నారు. కార్యక్రమంలో రైతులు మురళీమోహనరా వు, ఏఎంసీ డైరెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

# వైట్ బర్లీ.. నో వర్రీ! పెట్టుబడులు.. శ్రమ తక్కువ



**నికర ఆదాయానికి ఐటీసీ భరోసా**
**వర్జీనియా పొగాకుతో పోల్చితే సగమే ఖర్చులు**
**సాగుకు ఆసక్తి చూపుతున్న గిరిజన రైతులు**
**ఏజెన్సీలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం**

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 08 : జీలుగుమిల్లి,ఫిబ్రవరి8 : జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవల వైట్ బర్లీ పొగాకు సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వర్జీనియా పొగాకు పండించడం అధిక వ్యయప్రయాసలతో కూడినది కావడంతో దీనికి ప్రత్యామ్నాయంగా వైట్ బర్లీ పొగాకు సాగుకు గిరిజనులు మొగ్గు చూపుతున్నారు. కనీసం ఎకరం, రెండు ఎకరాల్లో కుటుంబ సభ్యులు నిత్యం తోటలో పని చేసుకుని తగిన ఆదాయం సమకూర్చుకునే వీలు ఉందని పేర్కొంటున్నారు. దీంతో మూడేళ్లుగా ఈ పంట సాగుపై చిన్నకారు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పంట కొనుగోలు విక్రయాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఐటీసీ ప్రతినిధులు వీరికి భరోసా కల్పిస్తున్నారు. పంట అమ్మకం అనంతరం పొగాకు కొన్న రైతు బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేస్తారు. మరోవైపు నాణ్యమైన ఎరువులు పురుగు మందులతో పాటు పంట ఎండగట్టే దశలో వర్షానికి తడవకుండా టార్పాలిన్లు సరఫరా చేస్తు న్నారు. పంట కొనుగోలు అనంతరం ఎరువులు, ఇతర పురుగు మందులకు అయిన ఖర్చును మినహాయించుకుని మిగతా సొమ్ము జమ చేస్తారు. ఐటీసీ సిబ్బంది రైతులకు పంటసాగులో మెలకులవలు, సూచనలు ఇస్తారు. ఈ పంటకు సాగుకు వర్జీనియా పొగాకు పెట్టుబడితో పోలిస్తే సగమే ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. మరో విశేషం ఏమిటంటే గతంలో గిరిజనులు అటవీప్రాంతంలో పోడు భూములు సాగులోకి తెచ్చి ఎగుడు దిగుడు (ఎత్తు పల్లాలు) నేలల్లో పత్తి పంట సాగు చేసేవారు. ప్రస్తుతం అదే పోడు వ్యవసాయాన్ని పంట మార్పిడి చేసి వైట్ బర్లీ వర్షాధారంగా పండిస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరులో నాటితే వర్షాకాలం పూర్తయ్యే లోపు వైట్‌బార్లీ పొగాకు ఏపుగా పెరు గుతుంది. ఎక్కువ తడులు అవసరం లేకుండా పంటను పెంచవచ్చని, ఎకరాకు ఖర్చులు పోను రూ.లక్ష వరకు మిగులుతుందని గిరిజన రైతులు చెబుతున్నారు. నాటేందుకు నారును సైతం ఐటీసీ అధికారులు సరఫరా చేస్తున్నా రు. ఈ సీజన్‌లో ఇప్పటికే కొందరు పెంచిన పంటను ఆకు రెలిచి పందిళ్లకు ఎండగడుతున్నారు. అనంతరం బేళ్లను తయారు చేసుకుని నిల్వ ఉంచి ఐటీసీ కొనుగోళ్లు ప్రారంభించగానే వారానికి పదిహేను రోజులకు ఒకసారి అమ్మకాలు జరుగుతాయి. ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది.

**కిలోకు రూ.165**

ధర విషయానికి వస్తే కిలో రూ.165కు ఐటీసీ ప్రతి నిధులు కొనుగోలు చేస్తారు. ఈ మేరకు ముందుగానే రైతు లతో ధర విషయమై ఒప్పదం కుదుర్చుకుంటారు. గతేడాది ధర కిలో రూ.150 నుంచి రూ.155 వరకు కొనుగోలు చేశార ని రైతులు చెబుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వర్షాధారంతో బుట్టాయగూడెం, పందిరి మామిడిగూడెం, కామవరం, ఏపులపాడు, జీలుగుమిల్లి మండలంలో రెడ్డిగూడెం, దిబ్బగూడెం, అంకన్నగూడెం, పూచికపాడు, వేలేరుపాడు మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు.

# వైసీపీ నేతల అడ్డగోలు బిల్లులకు బ్రేకులు

**జగనన్న కాలనీల లెవలింగ్ పనుల్లో అక్రమాలు**
**పనులు చేయకున్నా బిల్లుల కోసం కోర్టులకు**
**అడ్డుకుంటున్న గ్రామీణాభివృద్ధి శాఖ**
**తనిఖీలతో 'లెక్క' తేలుస్తున్న క్వాలిటీ కంట్రోల్**
**అక్రమ చెల్లింపులకు చెక్.. రికవరీలు**
**కోర్టు కేసులు విత్‌డ్రా చేసుకుంటున్న వైనం**



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 08 : గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల లెవలింగ్ పనుల్లో అడ్డగోలుగా దోచుకున్నారు. పనులు చేయకపోయినా చేసినట్టు వైసీపీ నేతలు, కార్యకర్తలు బిల్లులు చేసుకున్నారు. ఇంకా పెండింగ్ బిల్లులు ఉండటంతో కూటమి ప్రభుత్వంలో ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు పూర్తిగా పనులు చేయకపోయినా బిల్లుల కోసం ఏకంగా కోర్టును ఆశ్రయించారు. గ్రామీణాభివృద్ధి శాఖ క్వాలిటీ కంట్రోల్ విభాగాలతో తనిఖీలు చేపట్టి పనుల 'లెక్క' తేలుస్తుండటంతో వైసీపీ కార్యకర్తలు తోకముడుస్తున్నారు. కొందరు కేసులు ఉపసంహరించుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.1500 కోట్ల మేర పనులు చేపట్టామంటూ రికార్డులు సృష్టించి సుమారు రూ.1150 కోట్ల వరకు జేబులో వేసుకున్నారు. మరో రూ.300 కోట్లకు పైగా బిల్లులు రావాలంటూ కొందరు కోర్టులను కూడా ఆశ్రయించారు. అప్పట్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనులు నిషేధమంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలివ్వడంతో మిగిలిన బిల్లులు చెల్లించే బాధ్యతను గృహ నిర్మాణ శాఖకు అప్పగించారు. దీంతో పలువురు వైసీపీ కార్యకర్తలు పెండింగ్ బిల్లుల కోసం హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో హడావుడి చేసి బిల్లులు వసూలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ అప్రమత్తమైంది. ఆయా పనులను వెంటనే క్వాలిటీ కంట్రోల్ విభాగాలతో తనిఖీలు చేపట్టింది. క్వాలిటీ కంట్రోల్ నిర్ణయించిన మేర కోత విధిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఓ వైసీపీ నేత చేసిన పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేసి రూ.1.29 కోట్లు రికవరీ విధించడంతో ఆ నేత హైకోర్టు నుంచి కేసు ఉపసంహరించుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ కోర్టు కేసులకు సంబంధించి యంత్రాంగాన్ని బలోపేతం చేయడం, క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని అప్రమత్తం చేయడంతో వైసీపీ నేతల ఆటలు సాగడం లేదంటున్నారు. చేయని పనులకు కోర్టు ఆదేశాలతో బిల్లులు పొందే ప్రక్రియకు తెరపడిందని పేర్కొంటున్నారు.నాడు అడ్డగోలు దోపిడీ

గత ప్రభుత్వంలో చేపట్టిన లెవలింగ్ పనులపై కూటమి సర్కార్ వచ్చిన తర్వాత అసెంబ్లీలోను, క్షేత్రస్థాయిలోను ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5 శాతం జగనన్న కాలనీల్లో కూడా ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. చాలా గ్రామాల్లో ఊరిబయట చెరువులు, గుట్టలు, కొండల్లోను లెవలింగ్ పనులు చేసినట్లు మమ అనిపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తుచేయాలని కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆ శాఖకు చెందిన చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారిని ఆదేశించారు. గత 8 నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా కోర్టులను ఆశ్రయించినవారి పనులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు సత్వరమే తనిఖీలు నిర్వహించి కోర్టుకు నివేదికలు సమర్పిస్తున్నారు.

**50 శాతం తనిఖీలు పూర్తి**

రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం తనిఖీలు పూర్తయ్యాయి. 9,384 జగనన్న కాలనీల లెవలింగ్ పనులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ విభాగం తనిఖీలు చేపట్టింది. అందులో 4,336 పనులకు సంబంధించి రికవరీ చేయాలంటూ అధికారులు ఇప్పటికే ఆయా డ్వామా పీడీలకు సూచించారు. ఈ లోపు తమకు బిల్లులు చెల్లించాలంటూ సుమారు 367 పనులకు సంబంధించి 106 మంది వైసీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. కొన్ని మండలాల్లో అయితే 10 శాతం పనులు చేపట్టి నూరుశాతం బిల్లులు పొందే ప్రయత్నాలు చేశారు. నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో 38 జగనన్న కాలనీల్లో లెవలింగ్ పనులు చేపడితే అందులో 37 కాలనీల్లో అసలు నివాసానికే యోగ్యత లేనివి. వీటికి సంబంధించి రూ.2.58 కోట్లు పనులు చేసినట్లు ఎంబుక్‌లు రికార్డు చేయించుకున్నారు. అందులో ఇప్పటికే రూ.1.03 కోట్లు చెల్లింపులు జరిగాయి. ఇటీవల క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేపట్టడంతో అక్కడ రూ.38.21 లక్షల పని మాత్రమే జరిగిందని నిర్ధారణ అయింది. దీంతో వైసీపీ నేతలకు చెల్లించిన మొత్తంలో రూ.65.34 లక్షలు రికవరీ చేయాలని చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ నెల్లూరు డ్వామా అధికారులను ఆదేశించారు. 12 శాతం పనులు మాత్రమే చేసి నూరు శాతం బిల్లులు కొట్టేయాలని ప్రయత్నించారు.

# తమిళనాడు ఎన్నికల్లో పోటీ.. డీఎంకే, ఎన్డీయే మధ్య ఉంటుంది

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 08 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ఎన్డీఏ గట్టి పోటీ ఇవ్వనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఎన్డీటీవీ ప్రాఫిట్ సదస్సు 2026లో పాల్గొన్న నిర్మలమ్మ మాట్లాడుతూ.. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీ) బలంగా, చెక్కుచెదరకుండా ఉందని, చాలా సమన్వయంతో ముందుకు సాగుతోందని తెలిపారు..'హోరాహోరీ పోరు తప్పదు.. విజయంపై అధికార డీఎంకే నమ్మకంగా లేదు.. గతేడాది నుంచి మేము చేపట్టిన ప్రదర్శనలు, సభలతో ఒత్తిడికి గురవుతుంది' అని సీతారామన్ వ్యాఖ్యానించారు. నటుడు విజయ్ పార్టీ తమిళ వెట్రి కళగం కూడా తొలిసారి ఎన్నికల్లో పోటీకి దిగుతోంది.

'వారు ళిడీఎంకేరి మంత్రుల చేస్తున్న వ్యాఖ్యలు, ప్రకటనలు, ఉచిత వాగ్దానాలు, ఆలయాల పర్యటనలు వంటివి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని అధికార పార్టీ ఎన్నికలను ఎదుర్కోవడానికి ఆందోళన చెందుతోందని స్పష్టం చేస్తున్నాయి' అని కేంద్ర ఆర్థిక మంత్రి అన్నారు. తమిళనాడు, అభివృద్ధి గురించి మాట్లాడితే ఇకపై ఓట్లు పొందలేమని డీఎంకే గ్రహించినట్టు ఉందన్నారు. డీఎంకే పరిధి పరిమితమని, రాష్ట్రం వెలుపల దానికి ఆదరణ లేదని ఆమె అన్నారు. ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యతను సాధించేలా కేంద్ర ఆర్థిక మంత్రి హోదాలో నిర్మలా సీతారామన్ , బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆదాయ పంపిణీ విషయంలో దక్షిణ రాష్ట్రాలపై వివక్ష చూపుతోందన్న స్టాలిన్ తరుచూ చేసే ఆరోపణలకు నిర్మలమ్మ గట్టి సమాధానం ఇచ్చారు. 'కేంద్రం కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల కోసమే కాకుండా, అందరి కోసం పనిచేస్తుంది. రాష్ట్రాలు చేస్తున్న అప్పులు సుస్థిరం కాదని మేము వారికి చెప్పాం' అని ఆమె అన్నారు.



త్వరలోనే తమిళనాడులో శాసనసభ ఎన్నికలు జరగనుండగా.. అన్నాడీఎంకేతో కలిసి బీజేపీ కూటమిగా ఏర్పడింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మదురైలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు ముందు తమ కూటమిలో కొన్ని పార్టీలు చేరుతాయని తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నయానర్ నాగేంద్రన్ అన్నారు. మదురైలో ఒక భారీ సభను ఏర్పాటు చేవామని, ఎన్డీఏ నాయకులందరూ ప్రధానితో కలిసి వేదికను పంచుకుంటారని ఆయన చెప్పారు. తిరుప్పరంకుండ్రం మురుగన్ ఆలయాన్ని మోదీ సందర్శించే అవకాశం ఉందని నాగేంద్రన్ తెలిపారు. మదురై విమానాశ్రయం సమీపంలోని మండేలా నగర్‌లో బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జనవరి 23న చెన్నై సమీపంలోని మదురాంతకంలో ఎన్డీఏ మొదటి ఎన్నికల సభను మోదీ ప్రారంభించారు.

## ఈడీ రెడీ కల్తీ నెయ్యి ముడుపులపై కేసు నమోదు

**హవాలా గుట్టు తేల్చేందుకు.. మనీలాండరింగ్ చట్టం కింద ఈసీఐఆర్**
**లబ్ధిదారులు, ఏజెంట్లకు త్వరలో నోటీసులు**




క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 8 తిరుమల లడ్డూ ప్రసాదానికి జగన్ హయాంలో కల్తీ నెయ్యి సరఫరా చేసే క్రమంలో ముడుపులు ఇచ్చిన, పుచ్చుకున్న వారి పనిపట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగప్రవేశం చేసింది. హవాలా ద్వారా డబ్బులు చేతులు మారినట్లు తేలడంతో మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) నమోదు చేసింది. సుప్రీంకోర్టు నియమించిన సీబీఐ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం.. నాలుగేళ్లకు పైగా జరిగిన నెయ్యి సరఫరాలో నాటి టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిన్నప్పన్న మొదలుకొని 36 మందిపై నెల్లూరు ఏసీబీ కోర్టులో చార్జిషీటు దాఖలుచేసిన సంగతి తెలిసిందే. నెయ్యి సరఫరాలో రూ.235 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేల్చింది. ఇందులో రూ.20 కోట్లకు పైగా హవాలా జరిగిందని.. ఆ సొమ్ము తిరుపతిలోని మంగళం వద్ద ఉన్న ఓ ఇంటికి చేరినట్లు కనిపెట్టింది. అందులో రూ.75 లక్షలు టీటీడీ డెయిరీ నిపుణుడు విజయభాస్కర్‌రెడ్డికి, ఇంకో రూ.31 లక్షలు కమిషన్ ఏజెంటు శ్రీనివాసన్‌కు పోగా.. నికరంగా రూ.19.86 కోట్లు వైష్ణవీ డెయిరీ సీఈవో అపూర్వ చావ్డాకు చేరినట్లు నిర్ధారణ అయింది. అక్కడి నుంచి డబ్బు ఎక్కడికి వెళ్లిందనేది మిస్టరీనే. భోలేబాబా నిర్వాహకులు పొమిల్ జైన్, విపిన్ జైన్, ఢిల్లీ చాందినీ చౌక్ వ్యాపారి ఆశిశ్ అగర్వాల్(ఏ15) ఈ రాకెట్‌లో కీలకం. చాందినీచౌక్‌లో అగర్వాల్‌కు ఓ హవాలా దుకాణం (షాపు నం.304) ఉంది. నెయ్యిని ఇతడి నుంచి కొన్నట్లు భోలేబాబా నిర్వాహకులు తప్పుడు పత్రాలు సృష్టించారు.

ఇందుకు భోలేబాబా ఖాతాల నుంచి అగర్వాల్‌కు నగదు చెల్లింపులు జరిగాయి. ఆ డబ్బును అతడు విత్‌డ్రా చేసి హవాలా మార్గంలో నడిపించాడు. తొలుత రాధేశ్యామ్ ఓజా నడిపిస్తున్న హవాలా షాపు (నం.287)నకు.. తర్వాత అదే ప్రాంతంలో ఉన్న రిషబ్ జైన్ అనే మరో హవాలా వ్యాపారి(షాపు నం.18బీ)కి.. అటు నుంచి గ్వాలియర్‌కు చెందిన దీపక్ జైన్‌కు బదలాయిస్తూ వచ్చారు. దీపక్‌కు హవాలా మార్గంలో చేరిన డబ్బును తిరిగి వైట్‌గా మార్చి.. భోలేబాబా కంపెనీకే పంపించారు. ఆ డబ్బును పటేల్ లాలాభాయి తన హవాలా ఏజెంట్లయిన బెజవాడలోని భార త్ భాయి, మదరమ్ దేవాసి(చెన్నై), హైదరాబాద్‌కు చెందిన అర్జున్ గోస్వామిలకు పంపినట్లు తేలింది. ఈ సమాచారం ఆధారంగా ఈసీఐఆర్ నమోదుచేసిన ఈడీ.. త్వరలో ముడుపుల లబ్ధిదారులు, ఏజెంట్లకు నోటీసులు జారీచేసి విచారణ జరుపనుంది.

## కూలి పనులకెళ్లి కానరాని లోకానికి..

క్రైం కౌంటర్ న్యూస్, మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 8 కూలి పనుల కోసం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లిన రామసముద్రం మండలానికి చెందిన ముగ్గురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. 15మంది గాయపడ్డారు. శ్రీనివాసపురం పోలీసుల వివరాల మేరకు.. రామసముద్రం మండలానికి చెందిన 18 మంది కర్ణాటక రాష్ట్రం చింతామణి, అనూరు వద్ద చింతకాయలు రాల్చడానికి కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని వ్యానులో సొంత ఊరుకు బయలుదేరారు. కర్ణాటక రాష్ట్రం, శ్రీనివాసపురం వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రామసముద్రం మండలం నారిగానిపల్లె గ్రామం పూలకుంట్లకు చెందిన శ్రీనివాసులు(25), వెంకటమ్మ(60) పాతూరుకు చెందిన మునెప్ప(61) అక్కడికక్కడే మృతి చెందారు. గంగాధర్, సరోజమ్మ, అశోక్, వెంకటరమణ, రమణమ్మ, చిన్న గంగులమ్మ, సావిత్రమ్మ, లక్ష్మీదేవమ్మ, అనిల్, విశ్వనాథ్‌తోపాటు మరో ఐదుగురు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు శ్రీనివాసపురం పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను శ్రీనివాసపురం, కోలార్, మదనపల్లె ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసపురం ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతులలో శ్రీనివాసులుకు వివాహం కాలేదు. డిగ్రీ వరకు చదువుకుని కూలి పనులకు వెళుతున్నాడు. ఇతనికి అన్న, చెల్లెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను కోరారు.



# సినిమా



## ఏడు ఫ్లాప్‌ల తర్వాత నాగార్జునకు హిట్ ఇచ్చిన చిత్రం ఏదో తెలుసా.?

అక్కినేని నాగార్జున సూపర్ హిట్ చిత్రం 'ప్రెసిడెంట్ గారి పెళ్ళాం' వెనుక స్టోరీని రచయిత తోటపల్లి మధు గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వివరించారు. 90వ దశకం ఆరంభంలో తాను చాలా బిజీగా ఉన్న సమయంలో, చిరంజీవి కోసం ఒక గ్రామీణ నేపథ్యం కలిగిన విభిన్నమైన కథను సిద్ధం చేయాలనే ఆశ మధుకు ఉండేదట. అక్కినేని నాగేశ్వరరావు నటించిన మంచి రోజులు వచ్చాయి చిత్రం నుంచి ఒక ఔట్‌లైన్‌ను తీసుకొని, రెండవ భాగాన్ని పూర్తిగా మార్చి, కొత్త పాత్రలతో ఈ కథను తీర్చిదిద్దారు. మొదట ఈ కథను కోదండరామిరెడ్డికి వివరించగా, ఆయన దీనిని పెద్ద హీరోలకు కాకుండా చిన్న హీరోలకు సరిపోతుందని అభిప్రాయపడ్డారు.
కొంతకాలం తర్వాత నిర్మాత దొరస్వామిరాజు నుంచి పిలుపు వచ్చింది. నాగార్జున కోసం కథ చెప్పమని అడగగా, మధు వెంటనే అంగీకరించారు. విమాన ప్రయాణంలోనే దొరస్వామిరాజుకు కథా వివరించగా, ఆయనకు బాగా నచ్చింది. అప్పట్లో కథ చెప్పకముందే అడ్వాన్స్ తీసుకునే అలవాటు మధుకు ఉండగా, దొరస్వామిరాజు వెంటనే అడ్వాన్స్ ఇచ్చారు. హైదరాబాద్ చేరుకున్నాక, అన్నపూర్ణ స్టూడియోలో వెంకట్ అక్కినేని, దొరస్వామిరాజు, కోదండరామిరెడ్డిలకు కథను వివరించారు. మధు తన స్పాట్ ఇంప్రొవైజేషన్ నైపుణ్యంతో, డైలాగులతో సహా నాగార్జునకు 1 గంట 45 నిమిషాల పాటు కథను వివరించారు. నాగార్జున ఈ కథ విని ఎంతో హ్యాపీగా ఫీల్ అయ్యి, మధును కౌగిలించుకుని, ఈ సినిమా మాత్రమే కాదు, నా తదుపరి చిత్రాలకు కూడా మీరే రాయాలి అని కోరారు. అలాగే మద్రాసు నుంచి హైదరాబాద్ వచ్చేయమని పదేపదే చెప్పారు.
ఈ చిత్రంలో నాదముని అనే పాత్రను తాను సృష్టించినప్పుడు, ఆ పాత్రను కోట శ్రీనివాసరావు చేయాలనుకున్నట్లు మధు తెలిపారు. అయితే, నాగార్జున మాత్రం కోట కాదు.. తాను చేస్తే చాలా బాగుంటుంది అని మధును బలవంతం చేశారట. తనకున్న కమిట్‌మెంట్ల కారణంగా(ఏడాదికి 20 చిత్రాలు రాయాలి), మధు సున్నితంగా తిరస్కరించారు. ఈ చిత్రంలో చంద్రమోహన్ పాత్ర ప్రాధాన్యతను మధు నొక్కి చెప్పారు. ఈ సినిమా తీస్తే చంద్రమోహన్ కోసమే తీయాలి అని పట్టుబట్టి, కోదండరామిరెడ్డితో చంద్రమోహన్‌ను ఎంపిక చేయించారు. మా అమ్మ నాన్న పెరుమాళ్ళు, మా ముత్తాత నాగయ్య లాంటి డైలాగులు చంద్రమోహన్ చెబితేనే సహజంగా ఉంటాయని మధు వివరించారు.
దొరస్వామిరాజు తనకు మద్రాసులో పాండి బజార్‌లో ఫ్లాట్ కొనుక్కోవడానికి డబ్బు ఇచ్చిన కృతజ్ఞతతో మధు గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రానికి కన్నడ రీమేక్ హక్కుల విషయంలో దొరస్వామిరాజు మధుకు అదనంగా రెండు లక్షలు చెల్లించి, హక్కులు తీసుకున్నారని, అయితే 1992లో కన్నడలో రీమేక్‌లు చేయకూడదని ఒక రూల్ ఉండటంతో రీమేక్ ఆగిపోయిందని మధు తెలిపారు. ఆ తర్వాత సాయిప్రకాశ్ అనే దర్శకుడు అడగగా, మధు హళ్లి హీరో పేరుతో శివరాజ్ కుమార్ హీరోగా అదే కథను మార్చి కన్నడలో చేసి విజయం సాధించారు. దొరస్వామిరాజు డబ్బుకు ఆశపడకుండా, మీరు సొంతంగా చేసుకోండి అని చెప్పిన మంచితనానికి మధు ఎంతో రుణపడి ఉన్నారట. ప్రెసిడెంట్ గారి పెళ్ళాం అద్భుతమైన టీమ్ వర్క్‌తో రూపొందిన గొప్ప చిత్రమని తోటపల్లి మధు ఈ సందర్భంగా ప్రశంసించారు.





## ఉప్పు, జామకాయ కలిపి తింటున్నారా..?

విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉన్న జామకాయ ప్రయోజనాలు దాని రుచిని మించి ఉంటాయి. దాని తీపి, ఉప్పగా ఉండే రుచితో జామ మీ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి జీర్ణక్రియను మెరుగుపరచడం, మీ చర్మాన్ని మెరిసేలా చేయడం వరకు అనేక విధాలుగా మేలు చేస్తుంది. జామకాయలో ఆపిల్ కంటే 10 రెట్లు ఎక్కువ ప్రోటీన్, మూడు నారింజల కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. చాలా మంది ఆరోగ్యకరమైన జామకాయలను ఉప్పుతో తింటారు. ఇలా తినటం సరైనదేనా..? దీని వల్ల శరీరంలో ఏం జరిగేది ఏంటో ఇక్కడ చూద్దాం...
జామకాయను ఉప్పుతో కలిపి తింటే ఏమవుతుంది?
జామకాయను ఉప్పుతో ముఖ్యంగా నల్ల ఉప్పు, లేదా రాతి ఉప్పుతో కలిపి తినడం వల్ల దాని ప్రయోజనాలు పెరుగుతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అదనపు విటమిన్ సిని అందిస్తుంది. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. ఉప్పు జామ రుచిని పెంచడమే కాకుండా ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేస్తుంది. అయితే, మీకు అధిక రక్తపోటు ఉంటే, తక్కువ ఉప్పును వాడండి. జామపండును ఉప్పుతో తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇక్కడ చూద్దాం..1. జీర్ణక్రియ మెరుగుపడుతుంది–
జామకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది నల్ల ఉప్పుతో కలిపితే మలబద్ధకం, ఆమ్లత్వం, ఉబ్బరం నుండి ఉపశమనం కలిగిస్తుంది. కాబట్టి, కడుపు సమస్యలను తగ్గించడానికి, మీరు ఖచ్చితంగా జామకాయను నల్ల ఉప్పుతో తినాలి.
2. రోగనిరోధక శక్తిని పెంచుతుంది–
జామపండ్లలో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఉప్పు ద్రవ సమతుల్యతకు కూడా సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తికి గొప్ప కలయికగా మారుతుంది.
3. గుండె ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోండి–
జామపండ్లలోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ (ాణూ), రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ఉప్పు ఎలక్ట్రోలైట్ సమతుల్యతకు సహాయపడుతుంది.
4. రక్తంలో చక్కెర నియంత్రణ–
జామపండ్లలోని ఫైబర్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి. జామపండ్లకు ఉప్పు వేసుకోవడం వల్ల అదనపు రుచితో పాటు అనే ప్రయోజనాలను పొందవచ్చు.
5. బరువు నియంత్రణలో సహాయపడుతుంది–
ఉప్పు జామ రుచిని పెంచుతుంది. జామలోని ఫైబర్ మీకు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది బరువు నియంత్రణకు సహాయపడుతుంది.



## మీ శరీరంలో అద్భుతాలు చేసే మ్యాజిక్..

మనం ప్రతిరోజూ వంటల్లో రుచి కోసం, సువాసన కోసం కరివేపాకును వాడుతుంటాం. చాలామంది తింటున్నప్పుడు దాన్ని తీసి పక్కన పడేస్తారు. కానీ కరివేపాకు కేవలం ఒక మసాలా దినుసు మాత్రమే కాదు.. అది ఒక అద్భుతమైన నేచురల్ హెల్త్ టానిక్ అని ప్రముఖ యోగా గురువు డాక్టర్ హంస యోగేంద్ర వివరిస్తున్నారు. కేవలం 14 రోజుల పాటు క్రమం తప్పకుండా కరివేపాకును తీసుకుంటే శరీరంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఆమె స్పష్టం చేశారు.
కరివేపాకులో ఏముంది?
ఆయుర్వేదం ప్రకారం కరివేపాకు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందులో.. విటమిన్లు ా, దీ, జ, జు లతో పాటు ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది డయాబెటిస్ నిరోధక, గుండె రక్షణ లక్షణాలను కలిగి ఉంటుంది.
14 రోజుల ప్రయాణం -- శరీరంలో కలిగే మార్పులు
జీర్ణ వ్యవస్థకు పునరుజ్జీవం
కరివేపాకు జీర్ణ ఎంజైమ్‌లను యాక్టివ్ చేస్తుంది. దీనివల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు 14 రోజుల్లో క్రమంగా తగ్గుముఖం పడతాయి.
యవ్వనాన్ని కాపాడుతుంది
ఇందులోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరిస్తాయి. ఇది కణాల క్షీణతను అడ్డుకుని, వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది.
జుట్టు -- చర్మ సౌందర్యం
కరివేపాకులో ఉండే బీటా-కెరోటిన్, ప్రోటీన్లు జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తాయి. జుట్టు రాలడం తగ్గడమే కాకుండా, చర్మానికి సహజమైన మెరుపు వస్తుంది.
షుగర్ కొలెస్ట్రాల్ నియంత్రణ
కరివేపాకు ఇన్సులిన్ కార్యకలాపాలను మెరుగుపరిచి రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేస్తుంది. అలాగే చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్‌లను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.
ఎలా తీసుకోవాలి?
డాక్టర్ హంసాజీ సూచనల ప్రకారం.. ఉదయాన్నే 4-5 తాజా కరివేపాకులను నమిలి గోరువెచ్చని నీరు తాగాలి. మజ్జిగలో కరివేపాకు కలిపి తీసుకోవడం వల్ల చలవ చేస్తుంది. ఆహారంలో కరివేపాకు పొడి లేదా చట్నీ రూపంలో చేర్చుకోవచ్చు.

## తొలుత వద్దన్నారని హాలీడే ప్లాన్.. కట్‌చేస్తే..

తొలుత సెలెక్టర్లు వద్దనుకున్నారు. దీంతో జర్మనీలో దీర్ఘకాలిక సెలవులు గడిపేందుకు ప్లాన్ చేసుకున్నాడు. అలాగే స్పెయిన్‌కు వెళ్లి రియల్ మాడ్రిడ్ మ్యాచ్ చూడ్డానికి కూడా ప్లాన్ చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఉన్న తన స్నేహితులకు ఈ ప్లాన్ గురించి తెలిపాడు. అయితే, ఈలోపే భారత జట్టు ట్రైనర్ అడ్రియన్ లె రూక్స్ నుంచి కాల్ వచ్చింది. తనను డిస్టర్బ్ చేయవద్దని, నేను భారీగా ప్లాన్ చేసుకున్నాను అని కూడా చెప్పాడు. కానీ, శుక్రవారం రాత్రి వరకు ముంబైకి రావాల్సిన అవసరం ఏంటో చెప్పాడు. భారత జట్టు నుంచి పిలుపు రావడంతో.. తన టూర్ ప్లాన్ మొత్తం క్యాన్సిల్ చేసుకున్నాడు. వెంటనే దేశం తరపున తన బాధ్యతను నెరవేర్చేందుకు ముంబై వెళ్లాడు. వెంటనే టీమిండియా ప్లేయింగ్ 11లో పేరు చూసి షాకయ్యాడు. ఆ వెంటనే అంటే, 24 గంటల లోపే, అమెరికా జట్టుతో జరిగిన కఠినమైన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంలో హీరోగా మారి ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారిపోయాడు మన హైదరాబాదీ పేసర్ సిరాజ్. 24 గంటల్లో తన ప్లాన్ ఎలా మారిపోయిందో గుర్తు చేసుకుని షాక్ అయ్యాడు సిరాజ్. ఈ క్రమంలో ఫ్యాన్స్ కూడా తెగ సంబరపడిపోతూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ క్రమంలో అసలేం జరిగిందో సిరాజ్ చెప్పుకొచ్చాడు.రెడీ అవ్వు.. బ్యాగ్ సర్దుకో అంటూ కాల్..
ఆయన మాటల్లోనే.. "అప్పుడే సడెన్‌గా సూర్య భాయ్ (కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్) నాకు కాల్ చేశాడు. 'రెడీ అవ్వు, బ్యాగ్ సర్దుకో, వచ్చేయి' అన్నాడు. నేను 'సూర్య భాయ్, జోక్ చేయొద్దు, ఇది జరగదు' అన్నాను. ఆయన 'నిజం చెబుతున్నాను, రెడీ అవ్వు' అన్నాడు. ఫోన్ పెట్టిన వెంటనే నేషనల్ సెలెక్టర్ (ప్రజ్ఞాన్) ఓజా నుంచి కాల్ వచ్చింది. అలా ఒక్కసారిగా షాకింగ్ న్యూస్ తెలిసింది" అంటూ సిరాజ్ తెలిపాడు.
దేవుడు రాసిన విధి..
గాయపడిన హర్షిత్ రాణా స్థానంలో భారత జట్టులో చేరేందుకు మహ్మద్ సిరాజ్‌కు బ్యాగులు సర్దుకుని వెంటనే ముంబైకి ఫ్లైట్ ఎక్కేందుకు చాలా తక్కువ సమయం మాత్రమే దొరికింది. "దేవుడు రాసిన విధిని ఎవరూ మార్చలేరు. నేను వచ్చాను, మ్యాచ్ ఆడాను -- అన్నీ ముందే రాసి ఉన్నాయి. దేవుడు గొప్పవాడు. దాని మించినది ఎవరూ చేయలేరు" అంటూ సిరాజ్ చెప్పుకొచ్చాడు.



## వడ్డీతో సహా ఇచ్చిపడేశారుగా..

ఎట్టకేలకు న్యూజిలాండ్ 2024 ప్రపంచ కప్‌లో తమ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. అఫ్గానిస్తాన్ రెండేళ్ల క్రితం 2024 టీ20 ప్రపంచ కప్ లో న్యూజిలాండ్ జట్టును 75 పరుగులకే కట్టడి చేసింది. దీంతో 84 పరుగుల తేడాతో కివీస్ పై ఘన విజయం సాధించింది. 2026 టీ20 ప్రపంచకప్ లో గ్రూప్ డీలో భాగంగా జరిగిన మ్యాచ్ లో టిమ్ సీఫెర్ట్, గ్లెన్ ఫిలిప్స్ ల అద్భుతమైన ఇన్నింగ్స్ తో ప్రతీకారం తీర్చుకుంది. 5 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్ జట్టును మట్టికరిపించి విజయంతో న్యూజిలాండ్ ఈ టోర్నీని మొదలుపెట్టింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘాన్ జట్టు 183 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం న్యూజిలాండ్ జట్టు 17.5 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి ఈ లక్ష్యాన్ని చేరుకుంది.
ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ 42 బంతుల్లో 65 పరుగులు చేశాడు. గ్లెన్ ఫిలిప్స్ 42 పరుగులు జోడించగా, మార్క్ చాప్మన్ 17 బంతుల్లో 28 పరుగులు చేశాడు. డారిల్ మిచెల్ 14 బంతుల్లో 25 పరుగులు, కెప్టెన్ మిచెల్ సాంట్నర్ 8 బంతుల్లో 17 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఫిన్ అలెన్ ఒక పరుగుకు ఔటయ్యాడు. రాచిన్ రవీంద్ర గోల్డెన్ డక్‌గా ఔటయ్యాడు.
గుల్బాదిన్ నయీబ్ హాఫ్ సెంచరీ..
ఆఫ్ఘాన్ తరపున గుల్బాదిన్ నాయిబ్ హాఫ్ సెంచరీ చేశాడు. దీంతో ఆఫ్ఘాన్ 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. గుల్బాదిన్ (63 పరుగులు, 35 బంతులు), సెదికుల్లా అటల్ (29 పరుగులు, 24 బంతులు) మూడో వికెట్‌కు 51 బంతుల్లో 79 పరుగులు జోడించారు. కానీ, నెమ్మదిగా ఉన్న పిచ్‌పై పరుగులు సాధించడం కష్టంగా అనిపించింది. ఫెర్గూసన్ ఆరో ఓవర్ చివరి బంతికి గ్లెన్ ఫిలిప్స్‌కు క్యాచ్ ఇచ్చి ఓపెనర్ ఇబ్రహీం జాద్రాన్ (10)ను ఔట్ చేశాడు. గుల్బాదిన్ 29 బంతుల్లో తన అర్ధ సెంచరీని చేరుకున్నాడు. ఫాస్ట్ బౌలర్ జాకబ్ డఫీ బౌలింగ్‌లో అతను రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాదాడు. గుల్బాదిన్, దర్వేష్ రసూలి (20 పరుగులు, 13 బంతులు) 17 బంతుల్లో 33 పరుగులు జోడించి ఆఫ్ఘనిస్తాన్ స్కోరును 150 దాటించారు. ఆ తర్వాత 18వ ఓవర్లో పార్ట్ టైమ్ స్పిన్నర్ రచిన్ రవీంద్ర బౌలింగ్‌లో గుల్బాదిన్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఇది చివరి ఓవర్లలో ఆఫ్ఘనిస్తాన్ రన్ రేట్‌ను ప్రభావితం చేసింది. అజ్మతుల్లా ఉమర్జాయ్ (14) రెండు సిక్సర్లు కొట్టి జట్టు స్కోరును 180 దాటించాడు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com